స్కెచ్

# పుర పాలకులు

—బి. విద్యాసాగర్

ఆ వూళ్ళో మునిసిపల్ ఎన్నికల హడావుడి ప్రారంభం అయింది. పాత పురపాలకసంఘసభ్యులు మళ్ళీ ఎన్నికలలో అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. క్రొత్తవాళ్ళు కూడా నిలబడ్డారు. అయితే ఎన్నికల సుడిగాలికి తట్టుకుని వాళ్ళు నుంచోగలరో, లేక పడిపోతారో, కూర్చుంటారో ఎన్నికలు ముగిశాకగాని తెలియదు ఊళ్ళో యెన్నికల కబుర్లు జోరుగా ప్రారంభం అయినాయి పాతసభ్యుల గురించి, కొత్తఅభ్యర్థుల గురించి చర్చించుకుంటున్నారు

"పరంధామయ్య ఈసారి కూడా ఛైర్మన్ అవుతడంటావా" అన్నాడు వొకడు

"ఆయన లేకపోతే, మరొకరు యెలా అవుతారు! ఆయనకు పోటీ లేదు. ఛైర్మన్‌గా వుండగా నాలుగు రాళ్ళు వెనకేసుకున్నాడు. కూతురు పెళ్ళిచేశాడు. కొడుక్కు యం. బి బి యస్. చదువు చెప్పించాడు"

"ఈసారి రాఘవయ్యగారిని ఛైర్మన్ చేయాలని చూస్తున్నారటగా!"

"ఆయనకయితే, బాగా వుబలాటంగానే వుంది. కానీ ఆయనకు తగిన సపోర్టు లేదు పాతకౌన్సిలర్లు అంతా పరంధామయ్యగారి మనుషులే! ఆయనకే ఓటు వేస్తారు! వాళ్ళకు పరంధామయ్యగారితో పాటు వాటాలు వున్నాయి. మహా అయితే, పరంధామయ్యగారి బదులు, వాళ్ళ మనిషినే మరొకడిని ఛైర్మన్ చేస్తారు. అంతేకానీ ఈపాతవాళ్ళు మాత్రం మారరు"

"అయితే మనవూరు బాగుపడే మార్గం లేదంటావా! సరైన రోడ్లు లేవు పాడయిపోయినరోడ్లు బాగు చేయించరు క్రొత్తగా సిమెంటు రోడ్లు గానీ, తారురోడ్లు గానీ యేమి వేయటంలేదు ఎన్నాళ్ళు పోయినా గతుకులరోడ్లు! "ఖర్మ!" మునిసిపాలిటీ లెక్కలలో రోడ్లు వేసినట్టు, డ్రైనేజి క్రింద ఖర్చయినట్లు ఖర్చు వ్రాసుకుంటారు- పని మాత్రం యేమిజరుగదు"

"నిజంగాఖర్చుపెడితే, ఛైర్మన్‌కి కానీ, ఆయన మనుష్యులకు కానీ యేమి మిగలదుకదా!"

"అందుకని, రోడ్లు బాగుచేయించకుండా, డ్రైనేజిస్కీములు అమలు చేయకుండా, మునిసిపాలిటీ డబ్బుఅంతా దిగమ్రింగి కూర్చుంటే మనమంతా చూస్తూ వూరుకోవడమేనా! వీళ్ళను రేపుయెన్నికలలో వోడించాలి"

"అది మనవల్ల కాదు. వాళ్ళు డబ్బు యిచ్చి వోట్లుకొనుకుంటారు రేపు పోటీచేసే అభ్యర్థులు కూడా వోట్లకోసం నోట్లు విరజిమ్మగలిగితే, వాళ్ళను వోడించవచ్చును, లేకపోతే లేదు."

"ఏమయినాసరే, ఈసారి పరంధామయ్య ఛైర్మన్ కాకుండా చూడాలి. అతని మనుషులు కూడా యెవరూ యెన్నికలలో గెలవకుండా చేయాలి వాళ్ళకు వ్యతిరేకంగా మనం జనంలో ప్రచారం చేయాలి, వీళ్ళను ప్రజలు అసహ్యించుకునేటట్లు చేయాలి"

"దానివలన ప్రయోజనం యేమి లేదు. రేపు యెన్నికలలో చదువుకున్న వాళ్ళు వోటు చేయకపోయినా అలగాజనం వాళ్ళే డబ్బులు తీసుకుని వోటు వేస్తారు"

"అయితే, ఈఅన్యాయం యిలా కొనసాగుతూ వుండవలసినదేనా!"

ఈ సంభాషణ ఆ వూరి రాజకీయాలలో బాగా ఆసక్తి వున్న యిద్దరు యువకులమధ్య జరిగింది. వారికి మునిసిపాలిటీ నడుస్తున్న తీరు నచ్చలేదు. గతుకుల రోడ్లు, మురుగుకాలువలు, పెంటకుప్పలు చూసినప్పుడల్లా, వారికి మునిసిపల్ కౌన్సిలర్ల మీద ఛైర్మన్ మీద ఆగ్రహం కలుగుతోంది. కానీ, వూళ్ళో వాళ్ళు యెవరూ, గతుకుల రోడ్ల గురించి, మురికికాలువల గురించి కానీ, పెద్దగా పట్టించుకున్నట్లు లేదు. అందుకే పరంధామయ్య ఆటలు సాగుతున్నాయి.

మునిసిపల్ యెన్నికలకు నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు కార్యక్రమం ప్రకటించారు. ఇక వూళ్ళో యెన్నికలలో నిలబడదామనుకున్న వారిలో ఆసక్తి కలిగింది. కొంతమంది, సిటింగ్ మెంబర్లతో పోటీచేస్తే, గెలవడం కష్టంఅని విరమించుకున్నాడు. మరికొందరు డబ్బుకలవాళ్ళు, అవసరమయితే,


## పురపాలకులు

డబ్బు విరజిమ్మి వోట్లు కొనుక్కోవచ్చు కొనుక్కోవచ్చుననే ధీమాతో రంగంలోకి దిగారు. బలరామయ్య, రాఘవయ్య, చలపతి, సాంబశివరావు, నాగభూషణం, ఇస్మాయల్ నామినేషన్లుదాఖలు చేశారు. శేషావతారం అనే చిల్లరకొట్టు, ఫ్యాన్సీషాపువున్న వొకవర్తకుడు, రామభద్రయ్య అనే వ్యక్తి కూడా నామినేషన్లు దాఖలుచేశారు. కొందరు యెన్నికలలో పోటీకినిలబడితే యేమయినా గిట్టుబాటు అవుతుందేమోననే ఆశతో నామినేషన్ వేశారు. అంటే, ప్రత్యర్థి, తనను వుపసంహరించుకోమని బతిమాలి యేమయినా ముట్టచెపుతాడేమోనని ఆశతో, తమాషాకి నామినేషన్ వేశారు. ముగ్గురు ఇక నామినేషన్లు వుపసంహరించుకునే సమయానికి, వొక అభ్యర్థికి నిజంగానే యేదో ముట్టచెప్పడంతో, తప్పుకున్నాడు. మిగత యిద్దరూ మనకెందుకు ఈ యెన్నికలు అని వుపసంహరించుకున్నారు. ఇక నామినేషను వుపసంహరించుకునేందుకు వొక్క రోజు గడువువుందనగా, శేషావతారంగారు, యెన్నికలకు యెంతఖర్చు అవుతుందో అంచనా వేసుకుని, తనకు గిట్టుబాటుకాదని, వుపసంహరించుకున్నాడు. రామభద్రయ్యగారు తన డిపాజిట్ భద్రం కాదని నామినేషన్ వుపసంహరించుకున్నాడు.

నామినేషన్లు వుపసంహరించుకోవడంతో రంగంలో మిగిలినఅభ్యర్థులు యెన్నికలప్రచారం జోరుగా ప్రారంభించారు— పాత కౌన్సిలర్లు తమను తిరిగి యెన్నుకుంటే, ఈ సారి యెలాగయినా, మంచిరోడ్లు వేయిస్తామని, డ్రైనేజి స్కీము అమలుపరుస్తామని, హామీలు యిచ్చారు- పాత మెంబర్లు యెన్నాళ్ళు పోయినా పట్టణం అభివృద్ధి చేయడానికి పూనుకోరనీ, క్రొత్తవాళ్ళను యెన్నుకుంటే, వూరుబాగుపడుతుందని, క్రొత్త అభ్యర్థులు ప్రకటించారు- నిరుద్యోగులు అయిన కొందరికి మునిసిపాలిటీలో వుద్యోగాలు యిస్తామని వాగ్దానం చేశారు పాతకౌన్సిలర్లు బజారులో గోడలమీద అభ్యర్థుల పేర్లు ఎన్నికల గుర్తు, పోలింగు తేది వ్రాశారు- కొన్ని గోడలమీద కాగితలు అంటించారు- క్రొత్తగా యింటికి సున్నం కొట్టించుకున్న వొకాయన, తెల్లవారి చూసేసరికి, తన ప్రహరీగోడ అంతా యెన్నికలప్రచారంతో వుండటం చూసి విసుక్కున్నాడు— యేమిచేస్తాడు! ఎన్నికల రోజులు! అలాంటిసమయంలో తమ గోడలకు సున్నంకొట్టించడం పొరబాటు!

ఎన్నికలప్రచారం తీవ్రంఅయింది ఇంటింటికీ అభ్యర్థులు స్వయంగా వెళ్ళి వోటర్లను తమ "అమూల్యమైన" వోటువేసి గెలిపించమని కోరుతున్నారు కొందరు 'పెద్ద మనుషులు' తమ యేజంట్లను ప్రచారానికి వినియోగించుకుంటున్నారు బహిరంగసభలు యేర్పాటు చేసి, కొందరు అభ్యర్థులు, పాతకౌన్సిలర్లు ఛైర్మన్ చేస్తున్న అన్యాయాలు, అక్రమాలు, అవినీతిచర్యలు బహిర్గతంచేసి, వాళ్ళను వోడించాలని ప్రబోధించారు తమను గెలిపిస్తే, సిమెంటురోడ్లు వేయిస్తామని, భూగర్భ మురికిపారుదల స్కీములు చేపడతామని ప్రకటించాను.

రేపు యెన్నికలుఅనగా ప్రచారం యెక్కువ అయింది. కూలీ, నాలీ చేసుకునే జనం డబ్బుయిస్తే కానీ వోటువేయరనే నమ్మకంతో, క్రొత్తఅభ్యర్థులు, వోటుకు రెండు రూపాయలుచొప్పున పంచిపెట్టారు మధ్యతరగతి కుటుంబాలలోకూడా కొందరు బ్రాహ్మలకు 'సంభావన' యిచ్చారు. ఈ విషయం తెలిసి, యెన్నికల్లో పోటీచేస్తున్న పాత సభ్యులు వోటుకు మూడు రూపాయల చొప్పున రహస్యంగా పంచిపెట్టారు. వోటర్లు యేమిమాట్లాడకుండా రెండు వైపులా పుచ్చుకున్నారు ఎన్నికలు ముగిశాయి. ఫలితాలు ప్రకటించారు. మళ్ళీ పాతపాటే! పాతవాళ్ళే మళ్ళీ యెన్నికయ్యారు.

శ్రీ మారుతీప్రసన్న
మీ భవిష్యత్తు తెలుసుకోండి
అన్నివిధములైన ప్రశ్నలకు
జ్యోతిష విషయములకు
ఈ క్రిందివారిని సంప్రదించండి
జ్యోతిష ప్రశ్నా
సాముద్రిక విశారద
**కె. అనంత పాడిత్తాయి**
ఫోన్ : 61591
గాయత్రి భవన్ ఎదుట బిల్డింగ్
దీపక్ మహల్ వెనుక
నారాయణగూడ
హైదరాబాదు.